క్లుప్తంగా

జగన్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ పాదయాత్ర

రౌతులపూడి: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధించి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరుతూ గుమ్మరేగుల సర్పంచ్ రాపర్తి రామకృష్ణ తన అనుచరులతో కలసి గురువారం పాదయాత్ర చేపట్టారు. గుమ్మరేగుల నుంచి ప్రారంభమైన ఈ యాత్ర మండలంలోని రౌతులపూడి, బంగారయ్యపేట, శృంగవరం, మెరక చామవరం మీదుగా శంఖవరం మండలం శంఖవరం, నెల్లిపూడి, కత్తిపూడి మీదుగా గొల్లప్రోలు మండలం చేబ్రోల సమీపంలోని సత్తెమ్మతల్లి ఆలయం వరకూ సాగింది. అనంతరం సర్పంచ్, నేతలు సత్తెమ్మతల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తహసీల్దార్‌గా విద్యాపతి బాధ్యతల స్వీకరణ



రౌతులపూడి: స్థానిక తహసీల్దార్‌గా సీహెచ్ విద్యాపతి గురువారం బాధ్యతలు చేపట్టారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేసిన ఆయన పదోన్నతిపై రౌతులపూడి తహసీల్దార్ వచ్చారు. ఇప్పటివరకూ ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన బి.భీమారావు పదోన్నతిపై వేరే ప్రాంతానికి వెళ్లగా డీటీ పీవీవీ సత్యనారాయణ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నూతన తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

బాధితులకు చేయూత



గొల్లలగుంటలో బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న తోట రాంజీ

జగ్గంపేట: మండలంలోని గొల్లలగుంటలో అగ్ని ప్రమాద బాధితులకు మాజీ మంత్రి తోట నరసింహం తనయుడు, యువ నేత తోట రాంజీ చేయూతనందించారు. బాధితుడు ఎదూరి అప్పారావు కుటుంబాన్ని గురువారం ఆయన పరామర్శించారు. బాధితులకు ఆర్థిక సాయంతో పాటు, 50 కేజీల బియ్యం, దుస్తులు, నిత్యావసర వస్తువులు అందజేశారు. బాధితులను ప్రభుత్వం పరంగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కర్త, వైఎస్సార్ సీపీ నేత అత్తులూరి సాయిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు రావుల గణేష్‌రాజా, వక్ఫ్‌బోర్డు మాజీ చైర్మన్ గఫూర్, పార్టీ నేత రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పట్టణశాఖ అధ్యక్షుడిగా నారాయణాచార్యులు

తుని: బీజేపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడిగా న్యాయవాది ఎస్‌సీహెచ్ నారాయణాచార్యులును నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. తుని పట్టణంలో బీజేపీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని నారాయణచార్యులు తెలిపారు. పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు అభినందనలు తెలిపారు.

పాదయాత్రకు ఘన స్వాగతం

ప్రత్తిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునిచ్చిన వై నాట్ 175కి మద్దతుగా ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకూ చేపట్టిన పాదయాత్ర బృందానికి ప్రత్తిపాడులో ఘన స్వాగతం లభించింది. మంగళగిరికి చెందిన ఎస్సీ కమిషన్ మాజీ సభ్యుడు కత్తెపోగు బసవరావు నాయకత్వంతో శ్రీను, ధర్మ, రాకేష్, డేవిడ్ గత నవంబర్ 15న ఇడుపులపాయ నుంచి పాదయాత్ర చేపట్టారు. ఈ యాత్ర గురువారం ప్రత్తిపాడు చేరుకుంది. గ్రామంలో పాదయాత్రకు లయన్స్‌క్లబ్ ప్రతినిధి గుడాల వెంకటరత్నం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శేరు కృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల వీరబాబు, చెలంకూరి రాజబాబు, వాసా చిట్టిబాబు ఘనంగా స్వాగతం పలికారు. స్థానిక దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి కత్తెపోగు బసవరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ నెలాఖరున ఇచ్ఛాపురంలో పాదయాత్ర ముగుస్తుందని చెప్పారు.

గిరిప్రదక్షిణకు బస్సు సర్వీసు

తుని: స్థానిక ఆర్టీసీ డిపో నుంచి అరుణాచలం గిరి ప్రదక్షిణకు ఈ నెల 23న ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్టు స్థానిక డిపో మేనేజర్ ఎన్.కిరణ్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు విజయవాడ, శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా 26న అరుణాచలం చేరుతుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సులో ప్రయాణించేందుకు టికెట్ రూ.3500లుగా నిర్ణయించామన్నారు. టికెట్లు బుకింగ్ కోసం 73829 13216, 73829 21904 నంబర్లను సంప్రదించాలని ఆయన కోరారు.

రుణాలు వినియోగించుకోండి

అన్నవరం: యూనియన్ బ్యాంక్ అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఆ బ్యాంక్ రీజినల్ మేనేజర్ సాయి మనోహర్ సూచించారు. స్థానిక యూనియన్ బ్యాంక్ వద్ద గురువారం తుని నుంచి జగ్గంపేట వరకూ యూనియన్ బ్యాంక్ శాఖల ఆధ్వర్యాన మెగా క్రెడిట్ ఔట్ రీచ్ పోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వయం సహాయక బృందాలు, పెన్షనర్లు, మీడియం, స్మాల్ స్కేల్ ఇండస్ట్రీస్ స్థాపనకు గాను లబ్ధిదారులకు సుమారు రూ.4 కోట్ల రుణాలు అందజేశారు.

పేదల అభ్యున్నతే సీఎం జగన్ లక్ష్యం



లింగంపర్తిలో వరుపుల సుబ్బారావును సన్మానిస్తున్న నాగవంశీయులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- గౌరంపేటలో గడప గడపకూ..

శంఖవరం: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని గౌరంపేటలో గురువారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజబాబు, పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను అందించారు. ఈ సందర్భంగా వరుపుల సుబ్బారావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ భారీ మెజార్టీతో విజయం సాధిస్తుందన్నారు. పార్టీ శ్రేణులు కష్టించి పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ప్రతిపక్షాలు ప్రభుత్వంపై చేస్తున్న తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో సర్పంచులు రామిశెట్టి ఏసుబాబు, ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, వైఎస్సార్ సీపీ నాయకులు పర్వత వివేక్, మాదాసు ప్రసాద్, గుండ్రాజు బాబులు, పాకల రాజు, పడాల దొంగబాబు తదితరులు పాల్గొన్నారు.



గౌరంపేటలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

అన్ని వర్గాలకూ సమన్యాయం

ఏలేశ్వరం: అన్ని వర్గాల ప్రజలకూ న్యాయం చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరపులు సుబ్బారావు అన్నారు. మండలంలోని లింగంపర్తిలో గురువారం నాగవంశీయుల కులస్తులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ పాలనలో అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలతో పాటు సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు మళ్లీ అధికారం కట్టబెట్టాలని కోరారు. అనంతరం నాగవంశీయులు వరుపుల సుబ్బారావును సన్మానించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో గాడు రాఘవ, కాళ్ల శ్రీమూర్తులు, బి.వీరకృష్ణ, బి.సంజీవి, అడపా పార్థసారథి, యార్లగడ్డ రాజా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- వెదురుపాకలో ప్రభుత్వ భవనాలు ప్రారంభం

గోకవరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన గ్రామ సచివాలయ వ్యవస్థతో గాంధీజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం సాకారమైందని మాజీ ఎంపీ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని వెదురుపాకలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్లను గురువారం ఆయన ప్రారంభించారు. గ్రామంలోని సుమారు 110 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలను ప్రజల వద్దకే తీసుకువచ్చిందన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అన్ని అవసరాలను తీర్చడమే కాకుండా రైతుల సంక్షేమానికి అనేక పథకాలను అమలు చేశారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నవారికి సైతం మెరుగైన వైద్య సేవలందించేందుకు వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేశారన్నారు. జనరంజక పాలన అందిస్తున్న ప్రభుత్వానికి వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర శ్రీవల్లి, పార్టీ నాయకుడు సుంకర వీరబాబు, సొసైటీ చైర్మన్ దాసరి చినబాబు, సర్పంచ్ దాసరి సింగారమ్మ, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, జోనల్ ఇన్‌చార్జి గుల్లా ఏడుకొండలు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కర్రి సూరారెడ్డి, ఎంపీటీసీ పిల్లా అప్పారావు, కొల్లాటి రామకృష్ణ, ఆకుల సుబ్రహ్మణ్యం, దాసరి విష్ణు, దాసరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెదురుపాకలో లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న తోట నరసింహం

ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యం

కోటనందూరు: ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీపీ లగుడు శ్రీనివాసు అన్నారు. స్థానిక జెడ్పీ హైస్కూల్లో రూ.70 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను గురువారం తుని ఏఎంసీ వైస్ చైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, సొసైటీ చైర్మన్ గొర్లి రామచంద్రరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ శ్రీనివాసు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో చదివే పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారన్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్థానిక హైస్కూల్లో జూనియర్ కాలేజీ ప్రారంభం కానుందని తెలిపారు. సర్పంచులు లెక్కల ఉపేంద్ర, సుర్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు గరిసింగు దొరబాబు, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను, ఎంఈఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.



కోటనందూరు హైస్కూల్లో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న నాయకులు

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

ఏలేశ్వరం: బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ అన్నారు. మండలంలోని సిరిపురంతో పాటు ఎనిమిది గ్రామాల్లో పార్టీ స్థూపాలను నిర్మించగా ఆయా స్థూపాల వద్ద పార్టీ పతాకాలను గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పార్టీ నాయకులు సింగిలిదేవి సత్తిరాజు, కొల్లా శ్రీనివాస్, వెలుగూరి హరేరాం, ఉమ్మిడి వెంకట్రావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ గురువారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా చేబ్రోలులో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

తొండంగి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు గురువారం స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. దానవాయిపేట, వాకదారిపేట కేజీబీవీ, గడ్డిపేట, ఏవీ నగరం, రావికంపాడు, కొమ్మనాపల్లి, బెండపూడి, కొత్తపల్లి, చిన్నాయపాలెం, తొండంగి, పైడికొండ పాఠశాలల్లోని 1000 మంది టెన్త్ విద్యార్థులకు స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు టెన్త్ పరీక్షలకు అవసరమైన అట్టలు, పెన్నులు, ఇతర సామగ్రి అందజేశారు. కార్యక్రమంలో నేమాల శ్రీనివాసరావు (ఎన్ఎస్ఆర్), దుర్గాబాబు, రాజేష్, అజయ్, సాయిరామ్, ప్రేమానందం, గంగాధర్ సురేష్, శ్రీనివాస్, స్వామి తదితరులు పాల్గొన్నారు.



దానవాయిపేటలో టెన్త్ విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేసిన స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధులు

'పది' పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

తుని రూరల్: ఈ నెల 18 నుంచి జరిగే పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు కాకినాడ జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ తెలిపారు. తుని మండలం వి.కొత్తూరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయం, హంసవరంలోని ఏపీ మోడల్ స్కూల్‌లను గురువారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న మధ్యాహ్నం భోజనం, హాజరును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా డీఈఓ రమేష్ మాట్లాడుతూ మాస్ కాపీయింగ్ జరగకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. కేజీబీవీ, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్స్ అమృతవాణి, పద్మజ పాల్గొన్నారు.



హంసవరం ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రమేష్

మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- కిర్లంపూడిలో మహిళలకు చేయూత చెక్కుల పంపిణీ



కిర్లంపూడిలో మహిళలకు చేయూత నమూనా చెక్కు అందజేస్తున్న తోట నరసింహం

కిర్లంపూడి: మహిళల ఆర్థికాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. స్థానిక సత్యదేవ కల్యాణ మండపం ఆవరణలో గురువారం వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో గురువారం మహిళలకు వైఎస్సార్ చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తోట నరసింహం ముఖ్య అతిథిగా పాల్గొని 2895 మంది లబ్ధిదారులకు రూ.5.42 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేయూత పథకంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ మహిళలకు ఏడాదికి రూ.18,750 చొప్పున నాలుగేళ్లలో ఒక్కొక్కరికి రూ.75 వేల లబ్ధి చేకూరిందన్నారు. ఎన్నికల హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌కు ముఖ్యమంత్రిగా మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ, మండలాధ్యక్షుడు పెనగంటి రాజేష్, సచివాలయాల మండల కన్వీనర్ జోకా శ్రీను, వైస్ ఎంపీపీ బొద్దేటి గణపతి, వేగి రామకృష్ణ, పాముల చంటి, దాడి చినబుజ్జి, అడారి మహేష్, ఏపీఎం ఇనకోటి శ్రీనివాస్, ఎంపీడీఓ బడే రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ



ఏలేశ్వరంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు

ఏలేశ్వరం: పట్టణంలోని పేదలకు గురువారం ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. స్థానిక 3వ వార్డులో నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో లబ్ధిదారులకు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నారన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న సీఎం జగన్‌కు వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జువ్విన వీర్రాజు, సూతి ప్రసాద్, లోగీసు శేఖర్, బంటుపల్లి శ్రవణ్, దత్తిరాజా సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి సత్కారం

ఏలేశ్వరం: పట్టణంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సీఐటీయూ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బందిని పూలమాలలు, శాలువాతో సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి చంద్రావతి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించాలన్నారు. సమాజంలో మహిళలపై ఉన్న వివక్షతను రూపుమాపాలన్నారు. మహిళల రక్షణకు ప్రభుత్వాలు మరిన్ని చట్టాలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

ఏలేశ్వరం: పట్టణంలోని భవిత కేంద్రాన్ని గురువారం విభిన్న ప్రతిభావంతుల ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్ చామంతి నాగేశ్వరరావు తనిఖీ చేశారు. భవిత కేంద్రం పరిసరాలు, ట్యాబ్ వినియోగం, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు ట్యాబ్‌లపై అవగాహన కల్పించాలన్నారు. బోధనతో పాట వివిధ అంశాలపై శిక్షణ ఇవ్వాలని సూచించారు. పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ వరలక్ష్మి, సిబ్బంది వాణిపద్మజ పాల్గొన్నారు.

గోకవరం ఇన్‌చార్జి ఎంపీడీఓగా గోవిందు



ఎంపీపీ సుంకర శ్రీవల్లికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ గోవిందు

గోకవరం: మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎం.గోవిందు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ ఇక్కడ ఎంపీడీఓ పని చేసిన వసంత గత నెల ఉద్యోగ విరమణ చేశారు. ఆమె స్థానంలో శంఖవరం ఏఓగా పని చేస్తున్న గోవిందును ఇక్కడ ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించారు. ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎంపీపీ సుంకర శ్రీవల్లి, వైఎస్సార్ సీపీ నేత సుంకర వీరబాబులను మార్యదపూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో తన బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వానికి మద్దతు ఇవ్వండి

- మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు శంకర్ మల్లిక్
- తునిలో ఎన్నికల ప్రచారం

తుని: ప్రజా సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రభుత్వానికి మద్దతు ఇవ్వాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు, యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ కోరారు. స్థానిక 4వ వార్డు కొండవారిపేటలో గురువారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గత నాలుగున్నరేళ్లలో జరిగిన సంక్షేమ, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ప్రజలు సంతోషంగా ఉండాలంటే వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా, తునిలో మంత్రి దాడిశెట్టి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, తుని పట్టణశాఖ పార్టీ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్, గాంధీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అల్లాడ దివాణం, జేసీఎస్ కన్వీనర్ పొమర్తి మహేష్, నాయకులు జాన్ ఆనంద్, తుమ్మల పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



తుని కొండవారిపేటలో వృద్ధురాలి సమస్యలు తెలుసుకుంటున్న శంకర్ మల్లిక్

సురక్షిత ప్రయాణాలతో ప్రమాదాల నివారణ

- పెద్దాపురం డీఎస్పీ లతాకుమారి

తుని రూరల్: రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు సురక్షితంగా ప్రయాణిద్దామని పెద్దాపురం డీఎస్పీ లతా కుమారి అన్నారు. మండలంలోని తేటగుంట జంక్షన్‌లో ఎస్సై డి.రమేష్‌బాబు ఆధ్వర్యంలో గురువారం రోడ్డు ప్రమాదాల నివారణ, సురక్షిత ప్రయాణాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. తరుచూ ప్రమాదాలు సంభవించడం వల్ల ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రతిఒక్కరూ నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలన్నారు. నిద్రలేమి, డ్రంక్ అండ్ డ్రైవ్, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలను నడపడంతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు నివారణకు తుని రూరల్ పోలీసులు చేపట్టిన చర్యలు అభినందనీయమన్నారు. ప్రమాదాలు జరుగుతున్న జంక్షన్లలో ఏర్పాటు చేసేందుకు సమకూర్చిన స్టాపర్లు, పీపాలు, టైర్లను ఆమె ప్రారంభించారు. ప్రమాదాల నివారణకు ఏడు జంక్షన్లలో స్టాపర్లు, మరో మూడు చోట్ల సిగ్నల్ వ్యవస్థ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టామని రూరల్ సీఐ మూర్తి తెలిపారు. ఆత్మ చైర్మన్ చోడ్రాజు రాంబాబురాజు, సర్పంచ్ అత్తి నాగరాజు, ఉప సర్పంచ్ పోతుల పెదకాపు, పీఏసీఎస్ అధ్యక్షుడు గుండుబిల్లి వెంకటరమణ, కోటనందూరు ఎస్సై శంకరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు రాజబాబురాజు, గణేసుల వీరబాబు పాల్గొన్నారు.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ లతా కుమారి

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

తుని: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా తనయుడు యువనేత దాడిశెట్టి శంకర్ మల్లిక్ అన్నారు. తుని మండలం ఎస్.అన్నవరంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం తుని నియోజకవర్గానికి చెందిన 47 మంది బాధిత కుటుంబాలకు రూ.49.50 లక్షల విలువ చేసే ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేస్తున్న శంకర్ మల్లిక్

మొండి బకాయిల వసూళ్లను వేగవంతం చేయాలి

జగ్గంపేట: స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలో పేరుకుపోయిన రూ.88 కోట్ల విద్యుత్ మొండి బకాయిల వసూళ్లలో సిబ్బంది చొరవ చూపాలని విద్యుత్ శాఖ ఎస్ఈ టీవీఎస్ఎన్ మూర్తి సూచించారు. జగ్గంపేటలో ట్రాన్స్ కో ఏఈ రత్నాలరావు ఆధ్వర్యంలో గురవారం డివిజన్‌స్థాయి విద్యుత్ శాఖ అధికారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని 11 మండలాల్లో ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.8 కోట్లు బకాయిలు వుండగా, ఇప్పటి వరకూ మొత్తం రూ.88 కోట్ల మొండి బకాయిలు ఉన్నాయని తెలిపారు. వీటి వసూళ్లకు సత్వరమే చర్యలు చేపట్టాలని, లేని పక్షంలో విజిలెన్స్ దాడుల ద్వారా రికవరీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ డివిజన్ పరిధిలోని 11 మండలాల లేడీ ఏలు, ఏఈలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ మూర్తి

పదిలం.. ప్రత్యేకం..

- పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు సిద్ధం
- పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు
- నియోజకవర్గంలో 4,322 మంది విద్యార్థులు

కిర్లంపూడి: ఒకటి నుంచి తొమ్మిదో తరగతి ఓ ఎత్తయితే.. పది అత్యంత కీలకం.. భవిష్యత్తుకు ఇదే నిర్దేశం.. ఏ విద్యార్థికైనా పదో తరగతి భవిష్యత్తుకు మార్గదర్శకమవుతోంది. ఉన్నత చదువుకు బాట ఇక్కడి నుంచే పడుతోంది. అలాంటి పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక ప్రణాళిక అమలవుతోంది. విద్యార్థులు సైతం మంచి మార్కులు తెచ్చుకోవాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులపై మరింత శద్ధ తీసుకుంటున్నారు. జగ్గంపేట నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాల కింద 39 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. మొత్తం ఈ నాలుగు మండలాల పరిధిలో 4,322 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరు కానున్నారు. వీరి కోసం 19 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేశారు.

ప్రైవేటుకు దీటుగా..

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నాయి. దీనికి విద్యాధికారులు, ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలనే లక్ష్యంతో జూలై నుంచే ప్రభుత్వ బడుల్లో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వెనుకబడిన విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకుని, వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు.



తామరాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

మండలం	పాఠశాలలు	విద్యార్థులు	పరీక్ష కేంద్రాలు
కిర్లంపూడి	11	932	5
గోకవరం	12	1120	5
జగ్గంపేట	10	1710	6
గండేపల్లి	6	560	3

ఇలా చేస్తే మంచిది

విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించేందుకు ఉపాధ్యాయులు పలు సూచనలు చేస్తున్నారు. ప్రతి సబ్జెక్టులో ప్రధానమైన పాఠాలను బాగా చదవాలి. సందేహాలుంటే ఉపాధ్యాయులకు తెలిపి ఎప్పటికప్పుడు నివృత్తి చేసుకోవాలి. కఠినమైన పదాలకు అర్థాలను నోటు పుస్తకంలో రాసుకోవాలి. ఉపాధ్యాయులు సూచించిన ప్రణాళిక ప్రకారం చదివితే ఉత్తమ ఫలితాలు సాధ్యం. ఒత్తిడికి దూరంగా ఉండాలి. ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతతో చదవాలి. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని చదవడం వల్ల ఫలితం ఉండదు. దీంతో పరీక్షల సమయంలో ఎక్కువగా అలసిపోతారు. ఇంత వరకూ జరిగిన సమ్మేటివ్–1, ఫార్మేటివ్ పరీక్షల్లో చేసిన తప్పులు పునరావృతం కాకుండా చూసుకోవాలి. పాత ప్రశ్నపత్రాలను సాధన చేయాలి.

పరీక్షలకు సిద్ధం



పాఠశాలలో ఉదయం, సాయంత్రం నిర్వహించిన ప్రత్యేక తరగతులకు రోజూ హాజరవుతున్నా. ఉపాధ్యాయులు చెప్పినవన్నీ గుర్తుపెట్టుకొని పరీక్షలు బాగా రాస్తాను. ఇప్పటికే అన్ని సబ్జెక్టులను చదివి అవగాహన పెంచుకున్నా. పరీక్షలు రాయడానికి సిద్ధంగా ఉన్నా.

– గొల్లా రాజేష్, 10వ తరగతి విద్యార్థి, తామరాడ హైస్కూల్

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి



వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. గత ఏడాది ఫలితాలను బేరీజు చేసుకుని, గతంలో అనుసరించిన విద్యా విధానాలతో ముందుకు సాగుతున్నాం. ఈ ఏడాది కూడా నూరుశాతం ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం. విద్యార్థులూ శ్రద్ధతో ప్రత్యేక తరగతులకు హాజరవుతున్నారు.

– టి.జోసెఫ్, మండల విద్యాశాఖాధికారి, కిర్లంపూడి